గోదావరి తీరం.. చెత్తమయం

- డంపింగ్‌యార్డుల్లా మారిన గట్లు
- పేరుకుపోతున్న భవనాల వ్యర్థాలు
- వాహనచోదకుల అవస్థలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందంజలో నిలిపేందుకు నగరపాలకసంస్థ కమిషనర్, అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మరో పక్క ప్రజలు మాత్రం గోదావరి గట్టును మినీ డంపింగ్ యార్డులా మార్చేస్తున్నారు. గోదావరి అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఈ మినీ డంపింగ్ యార్డులు దర్శనమిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే. రాజమహేంద్రవరం నగర పరిధిలోని ఇన్నీసుపేట కైలాస భూమి నుంచి ధవళేశ్వరం వరకూ గోదావరి వెంబడి రహదారి ఉంది. ఈ రహదారిలో నిత్యం వేల మంది ప్రయాణిస్తుంటారు. కానీ రహదారి పక్కన నగరంలో పలు చోట్ల బిల్డింగ్ వెస్ట్ మెటీరియల్‌తో పాటు, చెత్తా చెదారాన్ని కుప్పలుగా పోసేస్తున్నారు. ఇదే రహదారిలో ఇసుక లోడుతో భారీ వాహనాలు సైతం తిరుగుతుంటాయి. ఆల్కాట్‌తోట సమీపంలో గోదావరి గట్టుపై, రైతుబజార్ సమీపంలోనూ భవనాల వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. నగరపాలకసంస్థ అధికారులు అనేక సార్లు వీటిని తొలగించి, శుభ్రం చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మాత్రం ఎటువంటి మార్పు రావడం లేదు.


గోదావరి గట్టుపై వేసిన భవనాల వ్యర్థాలు, చెత్త


రైతుబజార్ సమీపంలో పేరుకుపోయిన చెత్త

గడ్డర్లను సైతం వంచేశారు

సత్యసాయిబాబా ఆలయం వద్ద భారీ వాహనాలు రాకుండా వేసిన గడ్డర్లను సైతం గుర్తుతెలియని వ్యక్తులు వంచేశారు. దీంతో ఈ రోడ్డులో భారీ వాహనాలు తిరుగుతుండడంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు.


భారీ వాహనాల రాకపోకల నిరోధానికి వేసిన గడ్డర్ల దుస్థితి

చర్యలు తీసుకోవాలి



గోదావరిగట్టుపై భవనాల వ్యర్థాలను వేయడం వల్ల మినీ డంపింగ్ యార్డుల్లా దర్శనమిస్తున్నాయి. భారీ వాహనాల నిరోధానికి వేసిన గడ్డర్లను సైతం కొందరు వంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదావరిగట్టుపై వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– పదమటి నాగమణి, ఆల్కాట్‌తోట

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని హండ్రెడ్ ఫీట్ రోడ్డులో మంగళవారం సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్థానిక వీఆర్వో అప్పల నాయుడు ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. హండ్రెడ్ ఫీట్ రోడ్డులో కల్వర్టు పక్కన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతడు ఏడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మొలతాడులో పావలా సైజు దేవుడి ఇత్తడి బిళ్ల, తెల్లటి గెడ్డంతో ఉన్నట్టు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ 94407 96533, ఎస్సై 94911 22811 నంబర్లను సమాచారం ఇవ్వవచ్చన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో పీజీ విద్యార్థులకు శనివారం నిర్వహించిన చైతన్య స్కూల్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు 65 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జేకేసీ చైర్మన్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. వీటికి 106 మంది హాజరవ్వగా, ప్రాథమికంగా భాగంగా జరిగిన రాత పరీక్ష, డెమో (సబ్జెక్టు వివరణ) 65 మంది ఎంపిక అయ్యారన్నారు. చైతన్య విద్యా సంస్థల నుంచి కో ఆర్డినేటర్లుగా అరుణ్ కుమార్, కిరణ్ పాండే బృందం హాజరైంది. జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి, కళాశాల ఇంటర్న్‌షిప్ కో ఆర్డినేటర్ వై.రాము, పీజీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

9న ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆలయ అర్చకుడు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు, భక్తులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో తోకల వంశీయులు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించినట్లు తెలుస్తోందన్నారు. ఆ స్తంభం ప్రస్తుతం శిథిలస్థితికి చేరడంతో తోకల వారి వారసులు ఇప్పుడు పునఃప్రతిష్ఠిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు జరుగుతాయన్నారు. 9వ తేదీ ఉదయం 10.54 గంటలకు యంత్ర సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, అనంతరం మహాన్న సమారాధన ఏర్పాటు చేశారన్నారు.

విజయోత్సవం

సీటీఆర్ఐ: ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయం సాధించిన నేపథ్యంలో తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు.

అగ్రిస్టాక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారి మాధవరావు

మధురపూడి: రైతులు విధిగా అగ్రి స్టాక్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాధవరావు అన్నారు. కోరుకొండ మండలం మునగాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో మాట్లాడుతూ భూమిగల రైతులందరూ అగ్రిస్టాక్‌లో నమోదు కావాలన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలను అందుకోవచ్చన్నారు. అపరాలు, మొక్కజొన్న సాగులో మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీలు జయలక్ష్మి, మల్లికార్జునరావు, మండలాధికారిణి గౌరీదేవి పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో సింఫనీ ఎయిర్ కూలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న సింఫనీ సంస్థ ప్రతినిధి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆధునిక సాంకేతికత, సొగసైన డిజైన్‌తో రూపొందించిన అత్యాధునిక సింఫనీ ఎయిర్ కూలర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాయని సింఫనీ లిమిటెడ్ విజయవాడ బ్రాంచ్ హెడ్ శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కన్స్యూమర్ డ్యూరబుల్స్ పరిశ్రమకు చెందిన ప్రముఖ వ్యాపారులు, డీలర్ల సమావేశం నిర్వహించారు. సిలెంజో, మ్యాక్స్‌వింగ్, ఆర్కిటిక్ సర్కిల్, ఎయిర్ ఫోర్స్ సిరీస్‌లతో సహా సింఫనీ తాజా లైనప్‌ను పరిచయం చేశారు. ఎయిర్ కూలర్లతో పాటు సింఫనీ కొత్తగా ప్రారంభించిన గీజర్, టవర్ ఫ్యాన్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సౌత్ జోనల్ మేనేజర్ నవీన్ మాట్లాడుతూ తమ తాజా ఉత్పత్తుల శ్రేణి మీ పరిసరాలను చల్లబరచడమే కాకుండా మనశ్శాంతిని కూడా కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌టీ టెక్నోప్రో ఎండీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి


శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎంఐ నాయకులు

సీటీఆర్ఐ: ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని అంబేడ్కర్ మిషన్ ఇండియా (ఏఎంఐ) నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఎంఐ ఆధ్వర్యంలో గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఏఎంఐ జిల్లా అధ్యక్షుడు దొడ్డా నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగరాజు మాట్లాడుతూ దళిత సీనియర్ ఐపీఎస్ అధికారిపై కక్ష సాధింపు చర్యలను విరమించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం తీరుమార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో భాస్కర్, కొయ్య శేఖర్, కోరుకొండ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి ఏపీకి భారీగా నిధులు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తున్నాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జల్ జీవన్ మిషన్‌లో రూ.69 వేల కోట్లతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిపాదనలు పంపారని, త్వరలోనే ఆ నిధులు మంజూరు కానున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని, ముఖ్యంగా కోనసీమలో పుష్కలంగా వనరులున్న విషయాన్ని సంబంధిత మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకుని వెళ్లానని అన్నారు. ప్రతిపక్ష హోదా అడిగే నైతిక హక్కు మాజీ సీఎం వైఎస్ జగన్‌కు లేదన్నారు. 2014లో 67 సీట్లు ఇచ్చినా జగన్ అసెంబ్లీకి వెళ్లలేదన్నారు. ప్రతిపక్ష హోదా అడిగితే వచ్చేది కాదని, అవకాశం ఉంటే అదే వస్తుందని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి జరగదన్నారు. ఇసుక వేలం పాట నిర్వహిస్తే ప్రజలకు తక్కువ ధరకు ఇవ్వవచ్చని వీర్రాజు చెప్పారు.

ప్రజాభిప్రాయంతోనే ఇసుక ర్యాంపుల ఏర్పాటు

సీతానగరం: గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణతోనే నూతన ఇసుక ర్యాంపుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అన్నారు. నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై సింగవరం, కాటవరం సచివాలయాల్లో మంగళవారం పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సింగవరం ఓపెన్ రీచ్‌లో గోదావరి పరివాహక ప్రాంతంలో 34.4 హెక్టార్లు ప్రభుత్వ భూమిలో ఏడాదికి 3.44 లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలు జరుపుతామన్నారు. దీనిపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ సింగవరం ర్యాంపు నుంచి వెళ్లే ఇసుక లారీలతో దుమ్ము, ధూళి ఎగసిపడి పంటలు పాడవుతున్నాయని తెలిపారు. ర్యాంపులో ఇసుక తవ్వకాలు జరిపి వంగలపూడి ర్యాంపు నుంచి లారీలు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనికి జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు సానుకూలంగా స్పందించారు. కొందరు రైతులు సింగవరం ర్యాంపు నుంచి లారీలు వెళ్లడానికి అభ్యంతరం లేదని తెలిపారు. కాటవరం సచివాలయంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో జేసి మాట్లాడుతూ ఏడాదికి 2.31 లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలు జరుపుతామని తెలిపారు.

ఇంటిలో మగపిల్లలకూ జాగ్రత్తలు చెప్పాలి


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న జిల్లా మహిళా అధికారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తల్లిదండ్రులు ఎప్పుడూ ఇంటిలో ఆడపిల్లలకు జాగ్రత్తలు చెబుతుంటారని, వారితో పాటు మగపిల్లలకు జాగ్రత్తలు చెప్పాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి అన్నారు. జయహో మహిళా దినోత్సవంలో భాగంగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సరస్వతీ ఘాట్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీలక్ష్మి ప్రారంభించారు. అనంతరం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి, మహిళా ఇన్‌స్పెక్టర్ మంగాదేవి, సీడీపీవోలు సీహెచ్‌వీ నరసమ్మ, నాగమణి, బేబీ రాణి, ఎస్సై అమీనా బేగం, పోలీసు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. కోటిపల్లి బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకురావడంతో పాటు మహిళలకు అమలు చేస్తున్న వివిధ చట్టాలపై అవగాహన కల్పించేందుకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించామన్నారు.

ఆర్వోబీల నిర్మాణానికి గెజిట్ నోటిఫికేషన్

పెదపూడి: అనపర్తి మండలంలో లక్ష్మీనరసాపురం, మండపేట మండలం కేశవరంలో రైల్వే రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేశవరం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో ఆర్‌ఓబీ లేకపోవడంతో ప్రజలు రైల్వే గేట్ దాటి వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా నిర్మాణాలు పూర్తయితే ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. స్థల సేకరణ పూర్తయితే వెంటనే నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

నరసన్న తీర్థానికి ఏర్పాట్లు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి తీర్థానికి జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 9 నుంచి 15 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 10వ తేదీ మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం జరుపుతారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఏపీఈపీడీసీఎల్ అధికారుల ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. రథోత్సవం జరిగే ప్రాంతంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.

జీవన ప్రమాణాల మెరుగుకు చిత్తశుద్ధితో కృషి

- కలెక్టర్ ప్రశాంతి
- మండలంలో ఆకస్మిక పర్యటన


చంద్రేడులో స్థానిక సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి పంచాయతీల సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రంగంపేట మండలంలో మంగళవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా మండలంలోని చంద్రేడు గ్రామాన్ని సందర్శించి, స్థానిక సచివాలయం వద్ద గ్రామస్తులతో భేటీ అయ్యారు. ప్రజల విన్నపాలను ఓపికతో విన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ సమీపంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ ట్యాంక్ నుంచి నీరు లీకవుతుండడంతో సిబ్బందిని ప్రశ్నించారు. ట్యాంకు నిర్మించి 30 ఏళ్లు పూర్తికావడంతో లీకేజీలు ఏర్పడ్డాయని గ్రామస్తులు వివరించడంతో, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈని ఆదేశించారు. గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. గ్రామంలో సంపద సృష్టి కేంద్రం మంజూరైనప్పటికీ, న్యాయపరమైన చిక్కుల కారణంగా నిర్మాణం జరగలేదని, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మరో ప్రదేశాన్ని ఎంపిక చేశామని, సాంకేతిక మంజూరుకు పంపుతున్నట్టు ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం కలెక్టర్‌కు వివరించారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ విధులకు సరిగా రావడంలేదని, సరైన కారణాలు లేకుండా దీర్ఘకాలిక సెలవులు పెడుతుందని కలెక్టర్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు విన్నవించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బి.వెంకన్నబాబును కలెక్టర్ వివరణ కోరారు. అనంతరం ఇటీవల డయేరియా ప్రబలిన పాత వీరంపాలెం గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. డయేరియా బాధితుల వివరాలను ఆరా తీసి, డయేరియాపై ఆరోగ్య సిబ్బంది తీసుకున్న చర్యలను, ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై ఎంపీడీఓ వి.వీరసాయిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, విస్తరణాధికారి వెంకటరత్నంను అడిగితెలుసుకున్నారు.

నారీ ఫెస్ట్.. ఫుల్ జోష్

- నన్నయలో నారీ ఫెస్ట్ 2025 ప్రారంభం
- ఆకట్టుకున్న ప్రసంగాలు
- అలరించిన ప్రదర్శనలు

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'నారీ ఫెస్ట్ 2025' పేరిట మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో 'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతా, యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రఫలాః క్రియాః' .. స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దైవత్వం వికసిస్తుంది, అగౌరవించబడితే అక్కడ ఎంతటి వారికైనా తిప్పలు తప్పవనే విషయాన్ని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీతోపాటు పలువురు వక్తలు తమ ప్రసంగాల ద్వారా గుర్తు చేశారు. పూర్వకాలంలో వివక్షతకు గురైనప్పటికీ రాబోయే కాలంలో వివక్షత లేని సమాజం వైపు అడుగులు వేయాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. ఇదే విషయాన్ని వెల్లడిస్తూ, సమాజంలో మహిళల పాత్రను తెలియజేస్తూ నిర్వహించిన కార్యక్రమాలు, ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

చిన్నారుల కేరింతలు

వేదికపై మొదటిసారిగా నిర్వహించిన హెల్త్ బేబీ షో పోటీలకు విశేష స్పందన లభించింది. రాజానగరం, రాజమహేంద్రవరం పరిసరాల నుంచి పలువురు తల్లులు తమ చిన్నారులతో కలిసి వచ్చి, సందడి చేశారు. చిన్నారులకు బుడగలు ఇచ్చి, పోటీలు పెట్టారు. ఇదే సమయంలో ఆ చిన్నారుల ఉత్సాహాన్ని చూస్తూ తల్లులు కూడా చప్పట్లు కొట్టి ప్రోత్సహిస్తూ, కేరింతలు కొట్టించారు.

అదిరిన బామ్మ–మనుమరాలి ఫ్యాషన్ షో

బామ్మ మాట బంగారు బాట అనే విషయాన్ని తేటతెల్లం చేస్తూ, పెద్దలు చెప్పే మాటలు వింటూ వారి మార్గంలో పయనించాలనే స్ఫూర్తిని అందిస్తూ నిర్వహించిన 'బామ్మ – మనుమరాలి' షో అదిరింది. ఈ షోకు కూడా అపూర్వ ఆదరణ లభించింది. పెద్దలను పిల్లలు ఎల్లప్పుడూ గౌరవించాలని, వృద్ధాశ్రమాల అవసరం లేని సమాజం వైపు పయనించాలనే సందేశానందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రూప్ సింగింగ్, ఫ్యాషన్ షో, స్కిట్, డ్యాన్స్ తదితర పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. యూనివర్సిటీతో పాటు తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలోని మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశంలో వివిధ రంగాలలో పేరుప్రఖ్యాతులందుకున్న మహిళలు, స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడిన వీరనారీమణులు, సేవాతత్పరుల గురించి తెలియజేసేలా ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


వీరనారీమణులు, సేవాతత్పరుల వేషధారణలో విద్యార్థినులు


రాణీ రుద్రమదేవిగా..


సావిత్రీబాయి పూలేగా..


గ్రూప్ డ్యాన్స్



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు


దేవస్థానం పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ కల్యాణోత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం కోరుకొండలోని ప్రధాన కూడళ్లు, బస్టాండు, కూరగాయల మార్కెట్, పాత సంత మార్కెట్, సంత బజారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, సినిమా థియేటర్, పోలీసు స్టేషన్ సెంటర్లలో పోలీసులు తయారుచేసిన స్కీమ్ చార్టును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో ఉత్సవాలతో పాటు పోలీసుల సమాచారాన్ని ఉంచుతామన్నారు. అలాగే డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్‌తో కలిసి రథోత్సవం నిర్వహించనున్న రోడ్లను పరిశీలించారు.

సినిమాలు



శ్యామల:సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ:రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సూర్యప్యాలెస్:వావా
స్వామి:శబ్దం
శివజ్యోతి:మజాకా
అనుశ్రీ:మజాకా
రాజా:అగత్యా
ఊర్వశి:రామం గార్డ్,రాక్షస
మేనక:తకిట తదిమి తందానా
రంభ:అగత్యా
కుమారి:రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర:తండేల్
అశోక:జాబిలమ్మ నీకు అంత కోపమా
నామవరం:
వీఎస్.మహల్:మజాకా
ధవళేశ్వరం:
మురళీకృష్ణ:మజాకా
కడియం:
వెంకటసూర్య:మజాకా